# దేముడిచ్చిన సొమ్ము

కనకవల్లి మీద నిశిరేత్రి విరుసుకుపడింది గాలివాన, తళుక్కున మెరిసి పెళ్ళున పిడుగులుపడి దడదళ్ళాడ్తున్నది బూమి.

మెరుమ్మెరిసి పిడుగు పెటీల్మనే తలికి ఇళ్ళల్లో జనం ఇళ్లల్లోనే ఒకర్నొకరు కరుసుకొని కిక్కురు మనకుండా నిక్కినిక్కి సూసుకుంటున్నారు సుట్టు పక్కల. నల్ల పిడిరాయంటి తాపీ పని ఒడ్డె కొండయ్య మోకాల్లోతు నీట్లో తోసుకుంటూ వొచ్చి సావుకారు గురవయ్య రెండంతస్తుల సిమిటీమేడ వీదితలుపు దబ దబ బాదాడు.

గాలివాన్లో దొంగలు రానేవొచ్చారని కిటికీ రెక్కతెరిసి, యినప కమ్మీల్లోంచి తొంగిసూశాడు సావుకారు గురవయ్య.

"నే తాపీ కొండయ్యను గురవయ్యన్నా! నీ ఇల్లు బంగారంగాను కాత్తె తలుపు తీయవయ్యా కొంపమునిగిందీ!" అన్నాడు కొండయ్య, గురవయ్యను కిటికీ ఎల్తుర్లో సూస్తూ.

"ఆ మాట్టాడ్తున్నది కొండయ్యేనా? ఇదిగో కొండయ్యా నీకేవన్నా మర్యాదేనా ఓ పక్క అర్ధరాత్రి పిడుగులు పడ్తుంటే వొచ్చి దబదబ తలుపులు బాత్తే ఇంటో మనుష లేంగావాలా? యిప్పుడేం కొంపమీద కొచ్చింది తెల్లారి వెల్తురొచ్చినాక వొస్తే బాగుండునుగా!" అన్నాడు గురవయ్య, కొండయ్య కొండయ్యేనని నిర్ధారణ చేసుకుంటూ.

"కొంపే మునిగింది! కాత్తె తలుపుతియ్ గురవయ్యన్నా మాట్టాడాలి!" అన్నాడు కొండయ్య. "వుత్తపున్నానికి తలుపుతియమంటే సరా? ఆ మాట్టాడే రెండుముక్కలు యీ కిటికీ దగ్గరే మాట్టాడేస్తే యిబ్బందేంటీ అంట?" అన్నాడు గురవయ్య, "యీ గాలోనకు నాకొంప కూలిపోయింది గురవయ్యన్నా! నా నలుగురు పిల్లలు, నా పెల్లాం, యింటికొచ్చిన చుట్టం ఇంటిపక్క సింతసెట్టుకింద వాన్లో నాన్తుండారు!" అన్నాడు కొండయ్య సిరసిర్లాడ్తు.

"అరెరెరెరె! ఎంతన్నాయం జరిగింది! యింత తాపీపనివాడివి నీయిల్లే కూలి పోయిందా-కొండయ్య? అసల్ను వెప్పుడో సిమిటీఇల్లు కట్టుకునుండాల్సింది! కనీసం ఆ వుండకొంపకు పోతన్న పూసుండాల్సింది! మీ మనుషులకు ముందుచూపే వుండదేం? యిప్పుడుచూడు ఎంతిబ్బందయిందో!" అన్నాడు గురవయ్య దిగులుగా.

"సంపాయిచ్చేది కుటుంబం తిండికే సరిపోతుంటే సిమిటీ యాణ్ణుంచితెస్తా? గురవయ్యన్నా నీకు పున్నెం వుంటుంది రెండుదినాలు మీయింటో యాడన్నా తల దాసుకోనిత్తివా నీపేరు పదికాలాలు సెప్పుకుంటాం" అన్నాడు కొండయ్య.

"మాయింటోనా? చంపేశావ్! రేపు మా అల్లుడు రానే వొస్తున్నాడే!" అన్నాడు గురవయ్య, వీపు మీద ఎవరో బాదినట్టు.

"ఇంటోనంటే ఇంటోనా గురవయ్యన్నా! నాకామాత్రం తెలవదా మీ కిబ్బందయితుందని! మీ గొడ్డసావిట్టో ఏమూల సూపించినా సాలు. నీ రునం తీర్చుకుంటాం" అన్నాడు కొండయ్య.

"రామరామ! ఆ గొడ్డసావిట్లో అటు గొడ్డకు యిబ్బందై పాలీయకా, యిటు రొచ్చులో మీకిబ్బందయీ ఆదేమంత సబబుగా వుంటుంది కొండయ్యా? మన పెదరామయ్యగారి సావిట్లోగాని, బసవయ్యగారి సావిట్లోగాని యింకా ఇరవై ముప్పయి పశువుల్ని కట్టేసే జాగావుంది. నువెళ్ళి అడుగుతే కాదనరు. అసలు అంతదాకా ఎందుకూ? యిదిగో మనకెదురుగానే పెదరామయ్యగారి వడ్లకొట్టు ముందర పంచలో నిక్షేపంగా కావల్సినంత జాగావుంటే వెళ్ళివుండకా! పో నేచెప్పాగా, వెళ్ళి మళ్ళీ మీరు ఇల్లు కట్టుకునేదాకా మహరాజుల్లాగా వుండండి. పెదరామయ్య కాదనే మనిషి కాదని నీకు తెలిసిందేగా! పాపం. నీ చేతుల్తో మా మేడ కట్టిపెట్టావు, నీకూ ఓ గట్టిల్లు ఏర్పడుంటే నేనెంత సంతోషిద్దును కొండయ్యా! పిల్లలు కలవాడివి కనుక యిబ్బందులు నీవి. పదపద– ముందర నీ పెళ్లాం బిడ్డల్ని రామయ్యగారి కొట్టు మీదికి చేర్చు. వానలో అల్లాడిపోతుంటారు" అంటూ కొండయ్య నీటి మయంలో పడి కనుమరుగయేదాకా చూసి కిటికీ రెక్క వేసుకున్నాడు సావుకారు గురవయ్య.

గుడిసె కప్పు లెగిసిపోయి, గోడలు పడిపోయి అంతలావు గాలోన ఎంత పెట పెట్లాడిస్తున్నా కొంపలో వున్న కాసిని కూసిని తిండిగింజలూ, గుడ్డ గోసీ, కుండా బొండా దక్కినన్ని దక్కించుకుని, పిల్లాజెల్లాతో సుట్టం సూపుగా వొచ్చిన మేనల్లుడు వీరప్పను కలుపుకుని వీధిలో సింతసెట్టు కింద తడిసి నిలబడుండ పెల్లాం కోటమ్మ కాడికిసేరి, అందర్నీ పెదరామయ్య కొట్టుమీదకి పదమన్నాడు కొండయ్య.

"ఆ సావుకారు గు ర వ య్య సోటు సూపిత్తాడని అంతదూరం లగెత్తు కెల్తివిగా?" అంది కోటమ్మ వూరుకోక.

"ఎల్తే ఎల్లార్లే! మనకి గురవయ్య గొప్పయితే ఆయనకి మనం గొప్ప కావాలనే లెక్కేవన్నా వుండదెట్టా? యాడో ఓ సోటరెన్నాల్లు కల్లుమూసుకుంటే సరిపాయె– పదండి"

అన్నాడు కొండయ్య తుడిసేసినట్టు. పెదరామయ్య కొట్టుమీద గాలికి కొట్టుకొచ్చిన సెత్త సెదారం పోగుజేసి, సెకుముకితో నుప్పుముట్టిచ్చి ఒల్లు కాసుకున్నాక, పిల్లల్ని ఓమూల పండుకోబెట్టి తనోపక్క కోక పర్చుకుని పండుకుని, యింకూసేపిట్లో దిమ్మదిరిగి నిదరబోయింది కోటమ్మ.

మద్దె మద్దె వురుమురిమి డామ్మంటున్నా గాలోన వుసి మటుకు కాస్తెతగ్గి అడపా దడపా జల్లు పడ్తుందది.

బొడ్డో కాస్తెకూస్తె తడిసి మిగల్న లంక పుగాకు నుప్పుకాడ తంపటేసి, మేనల్లుడు వీరప్పకో ముక్క పారేసి తనో ముక్క సుట్ట ముట్టిచ్చి, పైపంచ వొల్లంతా బిగలాక్కుని వీరప్ప పక్కనే వద్దకొట్టు గోడ కానుక్కొచున్నాడు కొండయ్య.

"నిదర్రాటం లేదంట్రా ఈరప్పా?"

"నా కిప్పుడింక నిద్రరాకేం! దీని సిగదరగ మొత్తానికీ గాలోన ఇల్లు పణ్ణాకనే నూకిందే! యిదిగో కొండయ్య మావోఁవ్ పెద్దోణ్ణి నిన్న నగూడదుగాని తస్సదియ్యా అంతలావు సిమిటీ పని పతూళ్లో సేత్తావు కాత్తె ఆ సేత్తోనే ఓ సిన్న సిమిటీ యిల్లు మీగ్గూడా కట్టకపోయినా?" అంటూండగా మెరుమ్మెరిసి గురవయ్య రెండంతస్తులమేడ కొట్టొచ్చినట్టగుపించింది వీరప్పకు. "సూడు మన కెదురుగ్గా కొండల్లే ఎంతసిమిటీ మేడుండదో? అసువంటిది యీ గాలోనలు యాభై వొచ్చినా సెక్కు సెదరకుండా అటనే నిలబడుద్దనుకో! ఆ మేడ ఎవుర్ది కొండయ్య మావాఁ?"అనడిగాడు, వీరప్ప సుట్టదమ్ముకు కాత్తె తెప్పరిల్లుకుంటూ.

"ఆ సావుకారు గురవయ్య మేడ. నేను కట్టిందే" అన్నాడు కొండయ్య సీకట్లో గురవయ్య మేడ వేపు సూస్తూ.

'ఇదేనా నువు కట్టిన గురవయ్య సిమిటీమేడ కొండయ్య మావాఁ; అబ్బ? ఎంత పెద్దది!" అంటూ సుట్టతో అటనే నోరు తెరిశాడు వీరప్ప.

"దగ్గిరదగ్గిర ఓ యాడాది కట్టాను. మొత్తం ఎనిమిదొందల సిల్లర్దాకా గిట్టుబాటయింది. ఆ సమయంలోనే ఇటిగ్గడల్తో పెంకుటిల్లు కట్టుకుందామనుకున్నా గానీ, పెద్దకూతురు ఎంకటాం పెల్లికి ఆ ఎనిమదొందలకూ కాత్తెపైగానే కరుజైందని అందరికీ తెల్సిందేగా? పిల్లాజెల్లావుంటే యిగనంతే" అన్నాడు కొండయ్య.

"అవును. కాకుండా వుంటదా? మరి ఆడపిల్లల్తోగూడిన యవారమైపాయె! అయినా యిదిగో యిసువంటి గురవయ మేడోటి కట్టావంటే ఆ సందట్లోనే కాత్తె సిమిటీ,

కూసిని ఇటికెముక్కలు సేర్చుకుని మీ ఇల్లు గెట్టిసేసుకుంటే అనే దెవుడు?" అన్నాడు వీరప్ప. శాన్సు పోనేపోయిందంటూ.

"పొళ్ళూడగొట్టంగ్రా ఎదవను! ఆ పకారం దొంగగెడ్డి తింటే యీ వూళ్ళో నీకు మంచీలు పుడ్తయంట్రా? అది ముండమోపి బతుకులే! అయినా యీ ముదనష్టబ్బతుకులో తిరుగుడు యాడోవుంది! అదిగో మనకెదురుగా వుండ సావుకారు గురవయ్యను నువు సాంతం ఎరగవు. ఆ పుటకే వేరు! యిప్పటికి దగ్గిర్దగ్గిర యిరవైఏళ్ళ కిందట ఆ గుర్‌వయ్యా, పెల్లాం సుక్కమ్మలు యీ వూరు కట్టుగుడ్డల్తో వొచ్చారు. ఇయాల గురవయ్యకున్న ఆస్తెంతో నీకుతెల్సా? యీ యిరవై ఏళ్ళల్లో లోకులకు ఆ గురవయ సేసిన తెలివిగల పనేందో, నేను పొద్దస్తమానం రెక్కలిరుసుకుంటూ లోకులకు సేసిన నష్టమేందో యిప్పటికి నాకంతు పట్టటంలా!" అన్నాడు కొండయ్య సీకట్లో నిలకడగా సూస్తూ.

"ఏందేందీ? యింకా నేను గురవయ్యది ఈవూరేననీ, పుటకే సావుకారు పుటకనుకుంటున్నానే!" అన్నాడు వీరప్ప, అదేందో కాత్తె యివరంగా సెప్పమన్నట్టు.

"ఆరోజుల్లో అందరూ గురవయ్యను చనగపిండి గురవయ్యనేవోరు. యిప్పుడు సావుకారు గురవయ్యంటా రందరూ. సుమారుగా యిరవై ఏళ్ళకిందట నేను పొరుగూరు తాపీపనికెల్లి సందేల గెనువుఁ లెంటబడి ఇంటికి తిరిగొస్తుండా. అప్పటికి పొద్దుగూకి కనుస్కీకటి పడ్తుండా పరమటి దిక్కున ఆకాశం ఎర్రగా వుండట్టు నాకింకా గెపితికుంది. చరీగ్గా వూరి పొలిమేర దరిదాపుల కొచ్చేతలికి రాస్తామీద నల్లగా యిద్దరు మడుసులు మా వూరికి సేర్తా అగుపించారు. ఇంకాస్త దగ్గిరకొచ్చేతలికి ముంగలుండ మొగమడిసి నెత్తిన ఓ చీనారేకుపెట్టె, సంకలో సిన్న పిల్లతో ముంగల నడుస్తుంటే ఆడగూతురు ఎనకనే నెత్తినమూట, సేతిలో ఒక బొక్కినా లాంతరూ వూపుకుంటా కాత్తె నడ్డితో నడుస్తుందది. ఆళ్ళు గురవయ్యా, గురవయ్య పెల్లాం సుక్కమ్మలు. నన్ను సూడంగానే ఆల్లిద్దరూ 'బాబ్బాబ'ని కేక లేశారు.

"ఏ వూరు?" అనడిగాను.

"ఆ కనిపించేది కనకవల్లేనా బాబూ?" అనడిగారు గురవయ్యా, సుక్కమ్మలు.

"అవును. మావూరేలే. సుట్టా లెవురన్నా వున్నారా?" అనడిగాను.

"లేరు బాబూ. వూరు పచ్చగా వుంటుందనీ, పెద్దమనుషులు, మోతుబర్లున్నారని తెలిసి బతుకు తెరువు కోసం ముప్పయి కోసులు నడిచి మీవూరొస్తున్నాం బాబూ. తమ రేంపనిచేస్తుంటారు బాబూ?" అనడిగాడు గురవయ్య నన్ను.

"తాపీ పని, నాపేరు కొండయ్య. మా వూళ్ళో మీ రేంపని జేసుకు బతుకుతారు?" అనడిగాను.

"నలుగురు పెద్దలూ అనుమతిస్తే చిన్న పకోడీ లంగడి పెట్టుకుని పొట్ట పోసుకుంటాం బాబూ. నన్ను గురవయ్యాంటారు. తమ వూరి ఒకరిద్దరు ఆసాముల్తో చిన్న మాట చెప్పి ఏ అరుగో, పంచో చూపిస్తివా నీ మేలు మరిచిపోం కొండయ బాబూ" అన్నాడు గురవయ్య.

"మీకడుపున పుడ్తాం, కలకాలం మీ పేరు చెప్పుకుంటాం" అంది సుక్కమ్మ ఎనకమాలగా. 'అప్పుడు నిజంగా సుక్కమ్మ సిలకల్లేవుంది. పచ్చకోక గట్టి దబ్బ పొండల్లేవుంది! అప్పుడు జూసిన సుక్కమ్మ ఇంకా కల్లల్లో మెదుల్తుందది!"

"మావూరి పెదరామయ్యగారు సానా పెద్ద ఆసామి. ఆయన మాటన్నాడంటే యిగ దానికి తిరుగులేదు. ఆనక మీ అదురుష్టం ఎట్టుంటదో! పదండి పోదాం" అని సూటిగా పెదరామయ్య గారింటికి తీసికెల్లాను గురవయ్య సుక్కమ్మల్ని.

పెదరామయ్యగారు ఇంటిముంగల పంచలో లాందరు ముంగలకూకుని సుట్టతాగుతూ జీతగాళ్ళతో మాట్టాడ్తుండాడు. ఆయన గురవయతో మాట్టాడ్తున్నంతసేపూ సుక్కమ్మమీదే సూపునిలిపి ఒకట్రొండుసార్లు మీసకట్టు మెలెయటం నాకిప్పుడికి గెపితికుంది.

"ఈ పూట యిక్కడే నాలుగు మెతుకులుతిని, యీ పంచలో పడుండండి. పెద్దబజార్లో వున్న మా వడ్లకొట్లల్లో మూలకొట్టు ఖాళీగావుంది. తెల్లారి వెళ్ళి కొన్నాళ్ళు అక్కడే మీ బ్రతుకుతెరువు చూసుకుంటూ పడుండండి" అని తేల్చాడు పెదరామయ్యగారు. చరీగా మనకి ఎనకమాలుండ మూల కొట్టోని మునుపు గురవయ్యా, సుక్కమ్మలుంది" అన్నాడు కొండయ్య.

"క్లె! ఎంతసిత్రం! అంతా మాయ! నిజంగా ఆ ఎదురు సిమిటీమేడలో వుండే సావుకారు గురవయ్య యిప్పుడు నువు సెప్పే గురవయ్యేనా కొండయ మావాఁ?" అనడిగాడు వీరప్ప, ఓపాలి సప్పరించి.

"తబిసీలుంటే సెప్పుదీసుకు తన్ను, ఆమైన మరసనాడు పొరుగూరు పని కెల్లి పొద్దుగూకి తిరిగొస్తా గురవయ్య, సుక్కమ్మ లెట్టావుండారోనని వడ్డకొట్టుకాడికొచ్చి సూశా. కొట్టుమీన ఇల్లాబుడ్డి ఎల్దురులో – చరీగా యిదిగో యీడే – పకోడీలు, కారప్పూస, ఏర్చెనగ్గాయలు ఎదురు తట్టల్లో పేర్చుకుని, సిన్న గల్లాపెట్టె, తక్కెడ్తో గురవయ్య కూకునుండాడు. ఓ గోనె పట్టా మీద పిల్లది నిదరబోతుంటే పక్కన కూకుని సుక్కమ్మ

పిండేదో జల్లిస్తుండది. యిదిగో యీ తంబానికానుకుని సుట్ట కాల్సుకుంటూ పెదరామయ్యగారు నవుతా ఏదో లోకాభిరామాయనం గురవయ్య, సుక్కమ్మల్తో మాట్టాడ్తుండాడు" అన్నాడు కొండయ్య.

"ఆర్నీ! ఎంటపడ్డాడే, మొత్తానికి పెదరామయ్య యవర్తల్లే వుండాడే కొండయమావాఁ?" అన్నాడు వీరప్ప, లోన తొల్సినట్టయి.

"యవర్తేందిరా? నీకింకా కుఱ్ఱతనంరా. పెద్దమాటలు రానీమాక. అయినా పెదరామయ్యగారు పద్దాకా యీ కొట్టుమీన తిరుగాడ్తుంటే వూరిజనం నలుగురు నాలుగు రకాలనుకుంటుండా నాకు మటుకు పెదరామయ్యగారు యిప్పటికీ పెద్దమడిసల్లేనే వుంటాడు. బహు సరదా మడిసి! మాటకారి! అంతే. అయితే నన్ను మటుకు అప్పట్లో సుక్కమ్మసూపు తొల్చిందంటే నిజమనాల్చిందే! యిప్పుడు ముసల్దయిందనుకో. ఓరోజు యిటనే పొద్దుగూకుమాట్ల గురవయ్య అంగడికల్లి తొంగిసూశా. గురవయ్య వూళ్ళో బాకీల వసూళ్ళకి పొయ్యాడంట. సుక్కమ్మ కూతురు నిదరబోతావుంది. నే నెప్పుడొచ్చినా ఆ పిల్ల నిదరబోతా వుంటది. పెదరామయ్యగారు ఏ తంబం కాడన్నా వుంటాడేమోనని సూశాగానీ ఆనాడెందుకో అగుపళ్లా. సుక్కమ్మ యీ కొట్టు దరవాజాకాడ నిలబడుంది. ఇల్లాయి బుడ్డి దీపం ఎల్దుర్లో ఎనక పొలిమేరకాడ రాస్తామీన సూసినట్టే ఆకుపచ్చ కోగ్గట్టుకుని దబ్బపండల్లే మెరుస్తుండది.

"ఈ చనగల బస్తా కాస్త లోపలికి దొల్లిచ్చి పెడ్తా కొండయ్య బావా? యిందాకణ్ణుంచి నా కలవిగాకుండా వుంది" అంది సుక్కమ్మ, దరవాజా పక్కన పడుండ బస్తాను సూపిస్తూ.

నేను బస్తాను కొట్లోకి దొల్లిచ్చి ఓపక్కకు లాగుతుండానో లేదో, ఎనికిడ్తే వొచ్చి, 'యింకాస్త యీ మూలకు నెట్టి పెట్టవూ?" అంటూ వొంగి తనుకూడా బస్తాతోయటం మొదులు పెట్టిందేగాని-సుక్కమ్మొళ్ళు ఎచ్చగా, మెత్తగా వొత్తుకుని నా కొక్కపాలి ఒల్లు జలబరించి సెవఁట కారింది.

ఇంతలో కిఱ్ఱు సెప్పుల సప్పిడయి గబిక్కిన బెయిటికొచ్చి సూసేతలికి గురవయ్య వడ్డకొట్టు పంచమీన కెక్కుతుండాడు! కాకబుట్టి నన్నూ సుక్కమ్మను పెడి పెడి బాత్తాడనుకుండా! సుక్కమ్మ సప్పున బెయిటికొచ్చి "చనగల బస్తా ఆ బండి సుబ్బయ్య యీడ పారేసిపోతే కొండయ్య బావొచ్చి లోన పడేసేదాకా నా కది అలివిగాకనేబోయె" అంది. నిజానికి బగవంతుడుండాడు గాబట్టి చరిపోయిందిగాని ఏ నిమసాన ఎవురి మనసు ఎటుతూల్తుందో మనికి తెలవదుగందా!" అన్నాడు కొండయ్య.

"ఆరి! చినిమాకు మల్లే వుండదే, మరెసువంటి మడిసోకాని ఆ నిమిసాన సుక్కమ్మ కేందో తొలిసుంటది. లేకబోతే ఆడగూతురంత-" అంటూ కటిక్కిన ఆగిపోయి నాలిక్కరుసుకుండాడు వీరప్ప.

"చా ఎదవా! నీకింకా కుర్రతనంగాని, పగ్గాలు కాత్తె బిగలాగు" అన్నాడు కొండయ్య.

"అసలు నా కిసువంటివంటేనే సెద్దబయం కొండయమావాఁ"

కొండయ్య సెప్పటం మొదలుపెట్టాడు. "ఆ రేత్తిరి గురవయ్య మేం బువదిని పొండుకునేయాలకొచ్చి కూకుండాడు. 'ఇదిగో కొండయబాబూ! పెదరామయ్యగారు పెద్దమనిషి. అట్టా అని ఏళ్ళతరబడి ఆయన కొట్టుమీద మనం తిష్ట వేసుక్కూచుంటే ఏం బాగుంటుందో నువే చెప్పు? ఆ వడ్లకొట్టు కెదురుగా వున్న పన్నెండు సెంట్ల ఖాళీస్తలం పెదరామయ్యగారిదే నంట. నేను దీసుకుంటే అమ్ముతానన్నాడు. అయితే మనదగ్గిర డబ్బేమన్నా వుండాలా స్తళం కొంటానికి? మీ కళ్ళ ముందర మీ అందరి చలవతో ఏలెడంటే ఏలెడంత అంగడి పెట్టుకుని బతుకుతుంటిమి. అయినా ఏనాటికైనా పెదరామయ్యగారి కొట్టు కాళీ చేయకనూ తప్పదాయె. ఏమంటా కొండయ్యా? సరే, ఎట్టాగొట్ట తల తాకట్టుబెట్టి నెమ్మదిమీద అప్పు తీర్చుకుంటా, స్తళం అట్టాగే రిజిస్టరీ చేయించమన్నా. సాక్షిసంతకానికి నువుగూడా వుండాలి కొండయబాబూ! అన్నట్టు నీ సేతిసలవ మంచిది. వచ్చే దశమినాడు నీ బంగారంచేత్తో ఓ నాలుగు గదులు పెంకుటింటికి పునాదిపని మొదలు పెట్టిస్తివా కలకాలం నీ ఋణం మరిచిపోలేను. నీ మనసు మంచిదని నాకు తెలుసు అన్నాడు గురవయ్య. అప్పటికి గురవయ్య యీ వూరొచ్చి రెండేళ్ళయిందేమో. యింతలో పన్నెండు సెంట్ల స్తలంకొని, నాలుగ్గదుల పెంకుటింటికి గురవయ్య డబ్బు పిక్కాడని ఎవరూ నమ్మటానికి వీల్లేదు. ఆ పెంకుటిల్లు కట్టినందుకు నాకో యాభైరూపాయలు సేతుల్లోబెట్టి గెడ్డం పట్టుకుని 'ఎప్పుడన్నా కాసిని పకోడీలుగాని, పుగాక్కాడగాని అడిగి పెట్టిచ్చుకుపోతుండ' మన్నాడు! అది గురవయ్య అదురుష్టం అనాల్సిందే! నేను ఇల్లు కట్టినప్పట్నించీ గురవయ్య యాపారం కిట్ట కాలవ పార్నట్టు పారింది! గురవయ్య పకోడీఅంగడి పశారీదుకానంగా మారి, ఆ దుకానం నూనెగానిగ, కట్టెలడ్తీ పిల్లల్ని బెట్టింది. యిద్దరు బామ్మరుదుల్ని సాయంగా తెచ్చుకుని బామ్మరిదికి పెద్దకూతుర్నిచ్చి పెల్లిజేసి, అడ్తీలో ఒకణ్నీ, గానిగకాడ యింకోణ్ణీ పెట్టేశాడు. ఆ పట్టు పట్టున పదెకరాల ఒకటోరకం మాగాణిబూమి కొన్నాడు గురవయ్య. రెండేళ్ళకిందట చల్లగా ఆ పెంకుటింటిని రెండంతస్తుల మేడగా మార్పు సేయించి ఆ నెల్లోనే గుంటూర్లో

పుగాకు మిల్లున్న ఓ కుర్రాయన్ని తెచ్చి యింకో కూతురు పెళ్ళిజేశాడు. గురవయ్య సావుకారు గురవయ్యయినాడు!" అన్నాడు కొండయ్య.

"ఆర్నీ గురవయ్య! జలగపట్టినట్టు మాలావుపట్టుపట్టి యాడ్డాడ పెల్లగించేశాడన్నమాట! నేనిన్నాలూ యాపారంలో డబ్బులు పిల్లల్ని పెడ్తయ్యంటే యినిపిచ్చుకునేవోణ్ణిగాదు! మరిప్పుడు నమ్మకుండా ఎట్టుంటానూ?" అన్నాడు వీరప్ప క్యూడా యిసయం అంతుసిక్కినట్టు.

"మరి నువూ నేను యాపారం మొదలుపెడ్తే ఆవజాన డబ్బు కక్కుద్దంటావా ఈరప్పా?" అన్నాడు కొండయ్య.

"ఇసయం అది కానేకాదులే కొండయమావాఁ! లోకులకి పనొకొచ్చే పెద్ద పని నువూ సేత్తుంటివిగా! అంతలావు సిమిటీమేడలు కట్టినోడివి యీమాత్రం గాలోన తగిలేతలికి ఇల్లుగూలి పెల్లాంబిడ్డల్తో బజార్నపడ్తివే! యివి నాయంగల రోజులేనంటా?" అన్నాడు వీరప్ప.

"అవును. లేకుంటే గురవయ్య అంతమాటంటాడా? గొడ్డసావిట్లో తల దాసుకుంటానంటే పశువులు పాలియ్యవేమో అన్నాడు! ఎంతిసిత్రం! యిన్నాలూ గురవయ్య నన్నేది సాయం అడిగినా గురవయ్యకన్న నేనే మెరుగైనట్టనిపిచ్చేది! యీయాల తెల్సుకున్నా గురవయకూ నాకూ తేడా?" అంటూ సుట్టపారేసి తుబుక్కున వుమ్మాసి 'తెల్లార్తుండది యిగ పొందుకో రాదంట్రా ఈరప్పా?" అంటూ పైపంచ బిగాలక్కుని అటనే పొందుకున్నాడు కొండయ్య.

తెల్లారి పొద్దెక్కి సూరుడి సురుకు తగిలేసరికి గబిక్కిన లెగిసికూకున్న కొండయ్యకు ఎదురుగా సిమిటీమేడ దుకానంలో గురవయ్య అగుపించాడు పంగనామాల్తో నవుతా.

గబగబ పళ్ళు తోవుఁకుని పెల్లాం కోటమ్మ పిల్లాజెల్లని సముదాయిస్తూ నాలుగు తాటిమట్టలు పోగుజేసి నుప్పు రాజేసి వంటకం సాగియటం సూసిన కొండయ్య కూలిపోయిన ఇంటికాడికెల్లి సూసొత్తానని కోటమ్మకు సెప్పిపోతా గురవయ్య దుకానంలోకి తొంగి సూశాడు. ఒకరిద్దరు పుగాక్కాడ కోసం రావటం తప్ప సరుకులుకొనే జనం యింకా దుకానంలోకి సేరుకోలా.

"రా కొండయ్యా! పాపం! రాత్రి నీ కెంత ఆపద వచ్చిపడింది! అంతా ఆ పరమాత్ముడి చిద్విలాసం! వెనకటికి ఆ పెదరామయ్యగారి వద్దకొట్టు నన్నాదుకొన్నట్లే యివాళ నిన్నూ ఆదుకుంది! చూశావా విచిత్రం" అని కొండయ్యను పలకరించాడు గురవయ్య.

"అయితే నాకూ నీకు పట్టిన అదురుష్టమే పట్టుద్దంటావా గురవయ్యన్నా!" అనన్నాడు కొండయ్య.

"నా అదృష్టం సంగ. తెట్లావున్నా రేపు నీకు కనకాభిషేకం జరగదని ఎవరనగలరు? అంతా ఆ ఏడుకొండలస్వామి దయ!" అన్నాడు గురవయ్య.

"ఇదిగో గురవయ్యన్నా ఒక్క మాటగుడుతా నువు ఏమనుకోకుండావుంటే. యిన్నేళ్ళనించి నీకు కలిసొచ్చినట్టు ఒక్క నాడన్నా నాకు నాలుగు డబ్బులు కలిసొచ్చుద్దేమోనని సూశా! కాని అంతపని నాకీ యిరవైయేళ్ళలో జరగలా! కట్టుగుడ్డల్తో మా వూరొచ్చావు. యిప్పుడు పెద్ద మూడు దుకానాలూ, పదెకరాల మాగాణిబూమీ, యెంత పెద్ద సిమిటీ మేడకు యజమాని వయ్యావు. మరి ఇన్నేళ్ళు నేనూ నీతోపాటే రెక్కలిర్సుకుంటూ పనిచేశాను గాని నీకు పట్టిన అదురుష్టం నువు జేసే యాపారంలోనే వుందంటావా లేక నీకాడేదన్నా మంత్రకట్టున్నదంటావా గురవయ్యన్నా?" అనడిగాడు కొండయ్య?

"అబ్బ! ప్రశ్న ఎంత దూరానికిలాగి యిడిశావు కొండయ్యా? యింతకూ నేను ఏ కాస్త కూస్త సంపాయిచ్చుకున్నా అదంతా ఏ కనుకట్టో, మంత్రకట్టుతోనో సంపాయించా ననుకొంటున్నావా కొండయ్యా? అదంతా నీ భ్రమ. ఆ పరమేశ్వరుడే నన్ను కటాక్షించి రక్షిస్తున్నాడు!" అన్నాడు గురవయ్య. కళ్ళు మూసుకుని మనసులో ధ్యానం జేస్తూ.

"ఆ పరమాత్తుడంటే నీ కన్న నాకు బకితెక్కువే గురవయ్యన్నా? మరి నిన్ను సూసిన సూపుతో నన్ను సూడక ఎనకనే వదిలేశాడే! ఇదిగో గురవయ్యన్నోవ్? రేపుట్నుంచి నేనూ ఓ సిన్న పకోడీల్దుకానం పెట్తుండా-ఏమంటా?" అనంటూ గబగబ కూలిపోయిన యింటివేపుకు పోతున్న కొండయ్యను దుకానం బయిటిదాకా వొచ్చి తొంగి సూశాడు గురవయ్య.

**('అభ్యుదయ' 1957 ఆగస్టు)**